క్లుప్తంగా

హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు

వైరా: అధిక వర్షాలతో పారిశుద్ధ్యం లోపించడం, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండడం తదితర ఇబ్బందులకు గురవుతున్న ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చింతల వేణు తెలిపారు. ప్రజలు 85208 91543, 99484 55629, 90528 68415 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

సత్తుపల్లి మున్సిపాలిటీలో..

సత్తుపల్లి: విస్తృతంగా వర్షాలు కురుస్తున్నందున సత్తుపల్లి మున్సిపాలిటీలో కంట్రోల్‌రూంను 97046 71081 నంబర్‌తో ఏర్పాటు చేశామని కమిషనర్ మందా రవిబాబు తెలిపారు. ప్రజలు సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

క్రమశిక్షణతో చదవాలి

ఏన్కూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ సింహాచలం సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. అధ్యాపకులు సుందర్, కృష్ణప్రసాద్, బాబులాల్, వెంకటరామారావు, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి, లక్ష్మి, నర్సింహారావు, రమాదేవి, కిషోర్‌బాబు, రాజన్న, సాంబశివరావు, కవిత, లావణ్య, సుహాసిని, స్వరూప పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

కల్లూరురూరల్: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని సీడీపీఓ నిర్మల జ్యోతి అన్నారు. శనివారం కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని చెన్నూరు సెక్టార్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ ఒకటి నుంచి 30రోజుల పాటు జరగనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అనంతరం బోధన ప్రణాళిక చార్ట్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ రత్నమ్మ, సూపర్‌వైజర్ వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, పద్మావతి, మరెమ్మ, జాన్సీ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తా



మిట్టపల్లి కిరణ్‌కుమార్

వైరా: ఆర్యవైశ్య మండల కమిటీ ఎన్నికలు ఆదివారం జరగనుండగా తనను గెలిపిస్తే ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని మిట్టపల్లి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్య సంఘం ఎన్నికలో 1వ నంబర్‌పై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఓటర్లు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తమ వెంట తీసుకొని రావాలని సూచించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న శ్రీనివాసరావు

తల్లాడ: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుర్రం శ్రీనివాసరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శనివారం పాత పినపాకలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పంపించిన చెక్కులను ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వాసవీ గణపతి ఉత్సవాలకు భూమిపూజ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో నిర్వహించే వాసవీ గణపతి ఉత్సవాలకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్, ఆర్యవైశ్య సంఘాల బాధ్యులు వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్, పసుమర్తి గోపాలరావు, గంగిశెట్టి జగదీష్, పోలిశెట్టి శివకుమార్, గుండు ఉమామహేశ్వరరావు, వనమా నరేష్, సత్తిబాబు పాల్గొన్నారు.

నిలిచిన బొగ్గు ఉత్పత్తి

సత్తుపల్లిరూరల్: రెండురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లోకి వరద చేరటంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. జేవీఆర్ ఓసీలో 30వేల టన్నులు, కిష్టారం ఓసీలో 5వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని పీఓలు నర్సింహారావు, ప్రహ్లాద్ తెలిపారు.

బెల్టుషాపు తనిఖీలను అడ్డుకున్న గ్రామస్తులు

కారేపల్లి: వైన్‌షాపుల్లో అధిక ధరలను అరికట్టకపోగా బెల్టు షాపు తనిఖీలకు రావడం సరికాదని గ్రామస్తులు ఎక్సైజ్ అధికారులను అడ్డుకున్నారు. మండలంలోని మాణిక్యారం జీపీలోని గుడితండాలో శనివారం ఎక్సైజ్ ఎస్సై వసంతలక్ష్మి, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో గ్రామస్తులు తొలుత వైన్స్‌ల్లో అధిక ధరలను అరికట్టాలని అడ్డుకోవడంతో ఉద్యోగులు వెనుతిరిగారు.

విగ్రహాలకు సిద్ధంగా ఉన్న గణనాథులు



గణపయ్యలు రెడీ

- తయారీలో నిమగ్నమైన రాజస్థాన్ వాసులు
- ఈ ఏడాది గణపతి విగ్రహాలకు గిరాకీ
- ఆకట్టుకుంటున్న విగ్రహాలు

సండే స్పెషల్

గణనాథులు కొలువుతీరేందుకు ఇంకా ఏడు రోజులే ఉంది. గణపయ్య విగ్రహాలను ప్రతిష్టించేందుకు మండపాల ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్లో వివిధ ఆకృతులతో తయారు చేసిన ప్రతిమలు అమ్మకానికి రెడీగా ఉన్నాయి.

మధిర: వినాయక చవితిని పురస్కరించుకొని రాజస్థాన్ నుంచి వచ్చిన బొమ్మల తయారీదారులు గణనాథులను ముస్తాబు చేస్తున్నారు. గత మూడు నెలల కాలంగా బొమ్మల అచ్చులతో విగ్రహాలను తయారుచేసి తుది మెరుగులు దిద్దుతున్నారు. బొమ్మల తయారీలో నైపుణ్యం కలిగిన రాజస్థాన్‌కు చెందిన వందలాది కుటుంబాలు సుమారు రెండు దశాబ్దాల కాలంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారు వినాయక చవితి, దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా దేవతామూర్తుల బొమ్మలను అందంగా తయారు చేసి విక్రయిస్తుంటారు.

పనుల్లో నిమగ్నమైన తయారీదారులు..

జిల్లాలో సుమారు 500 కుటుంబాలకు పైగా ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఖమ్మం, వైరా, మధిర, ఎర్రుపాలెం, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, ఏన్కూరు, భద్రాచలం, తల్లాడ తదితర ప్రాంతాల్లో బొమ్మల తయారీ పనుల్లో నిమగ్నమయ్యారు. రాజస్థాన్ నుంచి వచ్చిన ఈ కుటుంబాలు విగ్రహాల తయారీ జీవనాధారంగా చేసుకొని ఇక్కడ నివసిస్తున్నారు.

ఆకట్టుకుంటున్న విగ్రహాలు..

ఓం, మహారాజ, పుష్పం, హంస, ఏనుగు, ఆవు, ఎలుక, సింహం, నెమలి, రాధాకృష్ణులు, నందీశ్వరుడు, పార్వతీ పరమేశ్వరులు, ఆంజనేయస్వామి, నెమలి, కృష్ణుడు, సూర్యచక్రం, తలపాగా, ఆవు, ఎద్దు, శివపార్వతుల ఒడిలో వినాయకుడు తదితర ఆకృతుల్లో ఉన్న విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి. రంగులతో అందంగా తీర్చిదిద్దిన ఆదిదేవుడు గణపతిని ఒక అడుగు నుంచి 11 అడుగుల వరకు విగ్రహాలను తయారు చేశారు.



విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్న తయారీదారుడు

పెరిగిన ధరలు..

రాజస్థాన్ రాష్ట్రం పాలీ జిల్లాలోని బికనీర్ ప్రాంతం నుంచి బొమ్మల తయారీకి కావాల్సిన కొంత ముడి సరుకులు తెచ్చుకుంటారు. అక్కడి నుంచి తెలుపు సిమెంట్, హైదరాబాద్ నుంచి గణపతి విగ్రహాలు తయారు చేసే అచ్చులు, రంగులు, విజయవాడ నుంచి కొబ్బరిపీచు కొనుగోలు చేసి విగ్రహాలను తయారు చేస్తారు. అయితే తయారీకి ఉపయోగించే వస్తువుల ధరలు పెరగడంతో పాటు ఖర్చులు కూడా పెరిగాయి. సుదూర ప్రాంతం నుంచి కొనుగోలు చేస్తే రవాణా ఖర్చులతో పాటు సమయం వృథా అవుతుందని భావిస్తున్న వారు ముందుగానే బొమ్మల తయారీదారులకు ఆర్డర్ ఇచ్చారు. మరోవైపు గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిబంధనలు పాటించాలని ఉత్సవ కమిటీల బాధ్యులకు మధిర సీఐ మధు తెలిపారు.

కాలుష్యం లేకుండా తయారీ...



25 సంవత్సరాలుగా మధిర ప్రాంతంలో వినాయక విగ్రహాలను తయారుచేసి విక్రయిస్తున్నాం. కాలుష్యం లేకుండా, ప్రజలకు హాని జరగకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ బొమ్మలను తయారు చేస్తున్నాం. ఈ ఏడాది బొమ్మల కొనుగోళ్లకు ఆర్డర్లు వస్తున్నాయి.

– టిక్కా, బొమ్మల తయారీదారుడు, మధిర

తక్కువ ధరకే లభిస్తున్నాయి..



మధిరలో తయారవుతున్న గణేష్ విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చాము. విగ్రహాలు అనేక రూపాల్లో ఉన్నాయి. రేటు కూడా అనుకూలంగా ఉంది. ఏడాదికి ఒకసారి ఈ ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

– బి.అనీల్, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి



వైరారూరల్: సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

వైరారూరల్: రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఏఓ పుల్లయ్య సూచించారు. మండలంలోని ముసలిమడుగు గ్రామంలో శనివారం వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ కానీ రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కానీ రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఏడీఏ కరుణ, ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓలు సైదులు, కీర్తి, రాజేష్, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని రెండు గ్రామాల్లో..

బోనకల్: మండలంలోని రామాపురం, గార్లపాడు గ్రామాల్లో రుణమాఫీ రేషన్‌కార్డులేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే శనివారం జరిగింది. మండల వ్యవసాయ అధికారి కె.విజయబాస్కర్ రెడ్డి సర్వే తీరును పరిశీలించారు. రామాపురంలో 10 రైతు కుటుంబాలకు గాను 8 రైతు కుటుంబాలకు, గార్లపాడులో 64 కుటుంబాలకు గాను 36కుటుంబాలకు సర్వే నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. అదేవిదంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన 33మంది రైతు కుటుంబ సభ్యులను నిర్ధారణ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు కార్తీక్, బందం రజిత, త్రివేణి, గోగుల హరికృష్ణ, షేక్ ఉస్సేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు సెమినార్

సత్తుపల్లిరూరల్: మండలంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ అన్ని బ్రాంచ్‌ల సెకండ్, థర్డ్, ఫైనల్ ఇయర్ విద్యార్థులు మేధోసంపత్తి హక్కులకు సంబంధించిన చట్ట పరమైన సమస్యలపై ఆన్‌లైన్ సెమినార్‌ను ఎంబీఏ డిపార్ట్‌మెంట్, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సెమినార్‌కు రిసోర్స్ పర్సన్‌గా యూజీసీ న్యూఢిల్లీ ప్రొఫెసర్ ఆఫ్ లా అండ్ జాయింట్ సెక్రటరీ లీగల్ బ్యూరో డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు వ్యవహరించారు. పేటెంట్ హక్కులు, కాపీ రైట్, ట్రేడ్ మార్కులు మొదలగు అనేక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సెమినార్‌లో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి, డీఎస్‌వీ కృష్ణారెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

తల్లాడ: మండలంలోని అంజనాపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు పంపిణీ చేశారు. ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని లయన్స్ సభ్యుడు మురళీ వీటిని అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీ పులబాల వెంకటేశ్వర్లు, ట్రెజరర్ వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

సత్తుపల్లిరూరల్: సింగరేణి సంస్థలో 30 సంవత్సరాలకుపైగా అందించిన సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. సత్తుపల్లి సీహెచ్‌పీ, సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో పని చేస్తున్న ఉద్యోగులు పదవీ విరమణ పొందిన అమరనేని వ్యాసులు, జేవీఆర్ ఓసీలో ఆర్ఆర్‌కె రాజు(ఫిట్ అండ్ మెకానిక్), ఎల్లయ్య (చైర్మన్)లను శనివారం ఐటీయూసీ ఫిట్ సెక్రటరీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, మోహన్, అశోక్, గోపి, చలపతి, జగన్నాథం, కోటి, చార్లెస్, నగేష్, నవీన్, చంద్రశేఖర్, నాగేందర్, ప్రవీణ్, రషీద్, మున్వర్‌ఖాన్, సునీల్, కేతినేని శ్రీనివాస్, కొరమరయ్య, లింగమూర్తి, చెన్నకేశవరావు, కాసర్ల సమ్మయ్య, కిషన్‌రావు, నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్వధర్మ క్షేత్రంలో మంత్రి తుమ్మల పూజలు

సత్తుపల్లి: మండలంలోని బుగ్గపాడు విశ్వధర్మక్షేత్రంలో శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనిత్రయోదశిని పురస్కరించుకొని స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

చల్లగుళ్లకు మంత్రి పరామర్శ..

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నర్సింహారావు మాతృమూర్తి అన్నపూర్ణమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నర్సింహారావు నివాసానికి వెళ్లి పరామర్శించారు. సాంబశివరావు, కృష్ణ పాల్గొన్నారు.

ఖమ్మం ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొణిజర్ల: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డిని వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం కలిశారు. కొణిజర్ల మండలంలోని ప్రధాన సమస్యలపై మాట్లాడి.. నిధులు మంజూరుకు కృషి చేయాలని తెలుపగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో రాయల పుల్లయ్య, గుండ్ల కోటేశ్వరరావు, తదితరులున్నారు.

గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో ఎన్నికలు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం బాలికలకు ఎన్నికలు నిర్వహించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహణ విధానాన్ని బాలికలు తెలియజేయాలనే లక్ష్యంతో కళాశాలలో ఎన్నికలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శ్రీవాణి తెలిపారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్ వారి ఆధ్వర్యంలో బరిలో నిలిచిన అభ్యర్థులు, బ్యాలెట్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఓట్లు లెక్కింపు అనంతరం విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నవ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జెన్కో సీఈ కుమారుడు ఆకస్మిక మృతి

కల్లూరురూరల్: జెన్కో సీఈ పప్పుల రత్నాకర్ కుమారుడు పప్పుల ధీరజ్ ఆకస్మిక మృతి చెందారు. స్వగ్రామం కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామానికి శనివారం మృతదేహాన్ని తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాగమయి పేరువంచకు చేరుకొని భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, ప్రభాకర్, కీసర మోహన్‌రెడ్డి, పరిమి భరత్ పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



చింతకాని ఎస్సై షేక్ నాగుల్ మీరా

చింతకాని: గణేష్ మండపాలకు కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై షేక్ నాగుల్ మీరా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ వారు గ్రామ పంచాయతీ, విద్యుత్ సంస్థల నుంచి అనుమతి పత్రాలు పొందాలని, మైకు పర్మిషన్‌ను పోలీసుల నుంచి తీసుకోవాలని సూచించారు. మండపాలు, గణేష్ నిమజ్జనాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందజేసి తప్పనిసరిగా అనుమతి పొందాలని తెలిపారు. విగ్రహాలను ఏర్పాటు చేసిన రోజు నుంచి నిమజ్జనం జరిగే కమిటీ సభ్యులు పూర్తి బాధ్యతలు తీసుకోవాలని సూచించారు.

రాజీ పడడమే రాజమార్గం



మాట్లాడుతున్న ఆరో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

సత్తుపల్లి: రాజీ పడడమే రాజ మార్గమని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లి కోర్టులో శనివారం పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్‌తో కలిసి జాతీయ లోక్ అదాలత్‌పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ నెల 28వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా పోలీస్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఖాసీంసాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.లావణ్య, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.అడమ్స్, ఏసీపీ రఘు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బోయినపల్లి రవికుమార్, పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లి: సత్తుపల్లి ఆర్టీసీ డీఎం యు.రాజ్యలక్ష్మి శనివారం నిర్వహించిన డయల్‌యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. దమ్మపేట బస్టాండ్‌కు విజయవాడకు వెళ్లే నైట్‌అవుట్ బస్సును తిప్పాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. అదే విధంగా మండలపల్లి బస్టాండ్‌లో సీసీరోడ్లు వేయాలని కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సత్తుపల్లికి చెందిన ఓ దివ్యాంగ వ్యక్తి తన సదరం సర్టిఫికెట్‌లో ఆంధ్రప్రదేశ్ అని ఉందని, తెలంగాణ అని ఉంటేనే బస్‌పాస్ ఇస్తారా అని అడిగారు. దీనికి ఆమె స్పందించి బస్‌పాస్ ఇవ్వాటానికి ఎలాంటి అభ్యంతరం లేదని, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి బస్‌పాస్ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ పాల్గొన్నారు.

'ప్రజ్ఞా వికాస్' పరీక్షలో విద్యార్థి ప్రతిభ



నవనీత్

చింతకాని: శ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి అనుబంధ ప్రజ్ఞా వికాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మండల పరిధిలోని నాగులవంచ శ్రీ ఆదర్శ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి జక్కుల నవనీత్ ప్రథమ బహుమతిని సాధించాడు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని పాఠశాల విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయటం కోసం ఇటీవల వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రతి జిల్లా నుంచి ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన ఆరుగురు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లాస్థాయిలో ఎంపిక కాబడిన విద్యార్థులకు సెప్టెంబర్ 2వ తేదీన హైదరాబాద్ ముచ్చింతాలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించబడతాయి. అదే రోజు జక్కుల నవనీత్ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా రూ.6 వేల నగదు, ప్రశంసా పత్రాన్ని అందుకోనున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నవనీత్‌ను పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్, ప్రిన్సిపాల్ చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరిశ సీతారత్నం ట్రస్టు, పసుమర్తి సూర్యం ఉదయలక్ష్మి స్మారక ప్రతిభా పురస్కారాలను శనివారం తహసీల్దార్ తఫ్జల్ హుస్సేన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ ఏడాది పది పరీక్షల్లో ప్రతిభ చూపిన షేక్ అయేషా పర్వీన్, తీర్థం శివరామ్, యం.మణివేణు, పి.గణేష్ లకు పరిశ సీతారత్నం ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య, తనికెళ్లకు చెందిన పసుపర్తి సూర్యం కుమారులు శంకరరావు, సత్యం సహకారంతో మెడల్, జ్ఞాపికలతో పాటు నగదు పురస్కారాలను అందజేశారు. సబ్జెక్ట్ టాపర్లుగా నిలిచిన ఆరుగురు విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.అబ్రహం, పాఠశాల ఉపాధ్యాయులు, పసుమర్తి సూర్యం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గద్దర్ అవార్డును అందుకున్న కోటి

బోనకల్: మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన చాపలమడుగు కోటేశ్వరరావు మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలో శనివారం జరిగిన అవార్డుల కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు గిద్దె రామనర్సయ్య చేతుల మీదుగా మెమెంటోను అందుకున్నారు. కోటి మంచి జానపద కళాకారుడు. అనేకమంది ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కోటేశ్వరావు మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

రోజంతా ఆగని వాన



మధిర: కృష్ణాపురం వద్ద పత్తిలో నిల్వ ఉన్న వర్షపు నీరు

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. పత్తి, వరి, ఇతర పంటపొలాల్లోకి వర్షపునీరు చేరింది. చెరువులు అలుగుపోసు కోగా.. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దీంతో పలువురు అధికారులు వాగులను పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమవ్వగా.. అధికారులు పరిశీలించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మరో రెండు రోజులు ఇలాగే వర్షాలు కురిస్తే వరి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ముదిగొండ: ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు



తల్లాడ: చేలల్లో నిలిచిన వర్షపు నీరు



ఎర్రుపాలెం: రేమిడిచర్లలో ముంపు ప్రాంత వాసులకు సూచనలిస్తున్న తహసీల్దార్ ఉషాశారద



మధిర : కృష్ణాపురంలో పాల వాగు వరదపై అధికారులకు సమాచారం ఇస్తున్న మధిర సీఐ



బోనకల్‌లో వర్షానికి నేలమట్టమైన ఇల్లు



కొణిజర్ల: మల్లుపల్లి, కొణిజర్ల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న పగిడేరు



ఎర్రుపాలెం: రామన్నపాలెంలో నీట మునిగిన డబుల్‌బెడ్రూం ఇళ్లు



బోనకల్: చిన్నబీరువల్లి-రాపల్లి ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న పెద్దవాగును పరిశీలిస్తున్న ఎస్సై మధుబాబు



చింతకాని: నాగులవంచ వద్ద ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేసిన పోలీసులు



వైరారూరల్: లింగన్నపాలెంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు



ఎర్రుపాలెం: భీమవరం - గుంటుపల్లిగోపవరం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వరద



మధిర: అలుగు పోస్తున్న మర్లపాడు చెరువు